

# కథా కౌముది

## ఇదం జగత్ డా.కనుపూరి శ్రీనివాసులు రెడ్డి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

చల్లని గాలి, వాన తుంపర్లు , ఆకాశంలో మబ్బుల విహారం , పులకించి పోతున్న పూల చెట్లు ! భూమాత హృదయ వీణతో చిటపట చినుకుల సప్త స్వరాలు పలికిస్తుంది !! జీవితానికి అర్థం పరమార్థం ప్రకృతి స్పందనలే అనిపించాయి. అంత మనోహరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం, హృదయాన్ని తెలియని సంతృప్తి నింపేసింది.వెంటనే అసంతృప్తి ముంచేసింది. నా మదిలో, ఇంటిలో, సెగలు పొగలు చిమ్ముతున్న అకారణ జన్మకు, ఎంత వెతికినా అర్థం దొరకలేదు.

" మది మతి లేనిది"

"మదికి కాదు మనిషికి. మతి లేని వాళ్ళతో నేను కాపురం చేయలేను."

తెలిసిందే ! నేను చెప్పిన ఎలాంటిమాట అర్థంకాదు, వినిపించదు. "నేనంటున్నది అదికాదు . చిన్న చిన్న పొరపాట్లుకు మనసును కంట్రోల్ చేసుకోలేకపోతే, స్తిమితంలేని కోతి చేష్ట అవుతుంది భార్యా భర్తలు బంధం.! మాటకు, మనుగడకు చాలా అవినాభావ సంబంధం ఉంది."

"ఎక్కడుంది అది.అది ఎప్పుడో చచ్చింది." రుసరుసలాడుతూ చేతిలో ఉన్న గరిటెను తిప్పుతూ కొట్టేటట్లు ముందుకు దూసుకు వచ్చింది.

విస్తుపోతూ సూటిగా ఆమె కళ్ళలోకి చూసాను. నిలిచింది. నిట్టూర్పు వదిలి, నా అసంతృప్తిని దిగమింగుకుంటూ " చిన్నదానికి ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తావు. మీ అమ్మ నాన్నలు ఎలా పెంచారో నిన్ను" పెట్రోల్లో అగ్గిపుల్ల వేశానే అని గుప్పెట్లో గుండెను దాచుకున్నాను.

"మా వాళ్ళను అంటే నేనొప్పుకోను. మిమ్మల్ని ఎలాపెంచిందో ఆ తల్లి. ఆవిడననాలి. ప్రతిదానికి చొద్దులు చెప్పే శాడిస్టును ఎలాకన్నావని?" ముక్కులు ఎగరేసి చేతిలో ఉన్న కత్తిని విసురుగా నేలకేసి కొట్టింది. కాళ్ళకు తగులుతుందేమో ప్రక్కకు తప్పుకున్నాను.

ఇదేవిటి అని అనిపించినా మామూలేకదా అని కోపాన్ని దిగమింగుకొని తీక్షణంగా చూసాను.

" ఏవిటి అలా చూస్తున్నారు. కొడతారా ..రండి.. మామూలేకదా !" పైట ఎగరేసి ఎద ముందుకు తోసింది అదుపు లేకుండా ఎగురుతున్నాయి వక్షోజాలు. ఛీ ఈ దరిద్రం కోసమేనా బంధం... బానిసత్వం. చేయి ఎత్తే ధైర్యం లేదు. ఇక లాభం లేదని సగం తిన్న ప్లేటులో చేయి కడుక్కో బోయాను.

"ఎక్కడికి లేస్తున్నారు. తినకుండా కదిలారంటే నా శవాన్ని చూస్తారు" ఒక్క ఆరుపు అరిచి చేతిని గట్టిగా పట్టుకుంది.

చాచి చెంప పగలగొట్టి " వెధవా! కూర బాగ లేదు అన్నందుకు ఇంతగొడవ చేస్తావా. పో ! చస్తానన్నావుగా చావు. పీడా వదులుతుంది." అనాలనిపించి వెనక్కు తగ్గి," చాల్లే ప్రేమ.ఆకలిగా లేదు."అంటూ ఆమెను నెట్టి హాల్లోకి వచ్చి కూర్చున్నాను. వాన కురుస్తూ నే ఉంది. గాలి విసురుతూనే ఉంది. కానీ విపరీతంగా చెమట పోస్తుంది.శూన్యం ..శూన్యం ? చీకటి ??

మాట్లాడుతూనే ఉంది. చాలా మంది తమలోని తెలియని అసంతృప్తిని అలాగే తీర్చుకుంటారు..

"నీ హక్కు-నా హక్కు. నీ హద్దు – నా హద్దు! అలా అయితేనే సంసారం."

" అదెలా మన అనికాదా? అందులో నీ ఆనందం నీది...నా ఆనందం వేరేనా !"

"హు..ఊ...అంతేకదా!"

"మరెందుకు ఈ పెండ్లి , తాళి?"

"వద్దు. తెంపెయ్యి. అంతగా ఉంటే రెండునిముషాల అవసరానికి పడుకుందాము! పరువు అని ఏడిస్తే ఒకే ఇంట్లో ఉంటాం కానీ నీ దారి నీది, నా దారి...??? అడగ కూడదు, అడ్డు రాకూడదు !!"

తల దించుకున్నాను కూర బాగులేదు అన్నందుకు తాళి తెంచుకోవడంలోని నిగూడ మర్మమేమిటో అర్ధంకాలేదు. మనసులో వేరే ఏదో ఉంది? మాంగళ్యం తంతునా ...తెంతునా! మమజీవన హేతునా ... అర్ధం మారిపోయిందా? వేద మంత్రాలకు. పెద్దల ఆశీర్వాదాలకు. అర్ధాలు ?? ఏడేడు జన్మల బంధం .. పంచ భూతాల సాక్షిగా ... అంతా

అబద్ధమా?మనసా వాచా కర్మణా అంటే...? భీజాక్షరాలలో పటుత్వం ఉండదా? మరీ కరివేపాకులా తీసిపారేస్తుంటే అంతర్ మధనం మొదలయ్యింది !!

హైందవం, ప్రాచీనమై, పాశ్చాత్యమైపోయింది. అంటే భ్రష్టు పట్టింది.

మనసును వసమునందు ఉంచుకుని సాధకుడు రాగ ద్వేష రహితుడై ఇంద్రియాల వల్ల విషయ సుఖాలు అనుభవించినా మనశ్శాంతి పొందును .” భగవద్గీత!! 2-64.

అంటీ అంటనట్టుగా ఉంచుకో తెంచుకో ... మరిచిపో !

స్థిత ప్రజ్ఞత అంటే అదేనా ?! మరీ దారుణంగా పురోగతి చెందుతుంది కదా ఈ సమాజం ?

అదేమో చెప్పినాయన్ను అడుగు!! నీ టైము వచ్చేవరకు భరించాల్సిందే!

టైమా ... అదేవిటి?

ఆలోచించకు. ఈ జీవితం చాలదులే. ప్రయత్నించకు మరణం దగ్గరుంటుంది .

“ మన శరీరంలో ఉండేది డెబ్బై రెండు వేల నాడులు. వెయ్యి నాడులు ఒక ఏడాది లెక్క. డెబ్బై రెండు సంవత్సరాలు వచ్చేస్తే పూర్ణంగా బ్రతినట్లు లెక్క. ఆ తరువాత స్విచ్చు ఆపేసిన సీలింగు ఫ్యానే! తిప్పినా తిరగదు. వేదాంతం నేర్చుకోవాలి. ఆత్మజ్ఞానం అలవరుచుకోవాలి, ఎందుకు జాగింగులు వాకింగులు, మృత్యు గంట మోగినట్లే ! అప్పుడెందుకండి యంగు లుకింగ్, నిక్కర్లు, ఫీజిక్కులు. శ్రాద్ధానికి గాకపోతే! ఫేస్ ప్యాకులు, బ్యూటీ పార్లర్లు..గంట కొట్టబోతున్నా ! అన్నన్నా ! తప్పు. చాలు. చలో!? ఒక ప్రవక్త చెప్పిన ఆలోచించతగిన మాట!!

అది దాటితే శవాలమేనా! ఏవిటో ...? మరి నూరు సంవత్సరాల ఆయుషు అని ఎప్పుడో నిర్ణయించే ఉందికదా? ఆయుష్షు తగ్గించడానికి ఆయన ఎవ్వరు? చస్తున్నా బ్రతకాలని చస్తుంటే ??

ఆలోచిస్తే ఆయన చెప్పిందికూడా నిజమేననిపిస్తుంది. డెబ్బై తరువాత, రొచ్చులు, రోగాలు, అవమానాలు పడేదానికంటే బాల్చీ తన్నేయడం మంచిదనేమో?

లాభం లేదు. ఇలాంటి జీవితాన్ని ఇక భరించలేను. ఆత్మహత్యే మార్గం!!

ఎందుకు? ఆయన చెప్పాడనా?

కాదు. పెండ్లి చేసుకున్నందుకు

శుభం పలకరా పెండ్లికొడకా అంటే పెండ్లికూతురు ముండేది అని అడిగినట్లుంది.

చక్కర వ్యాధి ఊట బావంత, రక్తపోటు తాటిచెట్టంత, మనిషి ఏనుగంత, బుద్ధి మోకాళ్లలో,ఆలోచన బురద గుంట.!! ఇంకా...??

“ఎవరితో అండి, మాట్లాడుతున్నారు.?”

భార్య మాటలకు ఉలిక్కి పడ్డాను .” నేనా! ఎవ్వరూ లేరే.?” మాటకు నత్తి అతుక్కుంది.

"మీరు ఎన్నయినా చెప్పండి. మనసును మభ్యపెట్టుకోలేక పోతున్నాను."

"ఆలోచించు. మన స్తోమతను బట్టే కదా మన కోరికలుఉండాలి. దానికే విడిపోవడాలు ఎందుకు.?"

"అదే చెపుతున్నాను. కలలుగానే మిగిలిపోతాయనే, దూరంగా వెళ్లి నిజం చేసుకుందామనే !! "

"సాధించాలంటే కలిసి ఉండాలిగాని దూరంకావడం ఏవిటి.?"

" ఆఫ్టరాల్ ! పండక్కి ఒక చిన్న బహుమతి నేను అడిగింది. బంధాన్ని తాకట్టు పెడుతారా?

నేనా నువ్వా అని అడగబోయి," మరో సారి ఆలోచించు మచ్చ లేని ప్రేమ కావాలో వ్యక్తిత్వాన్ని చంపుకుని మోసంతో, మానాన్ని తాకట్టుపెట్టే లంచం కావాలో ?" గుండెను అరిచేతిలో ఉంచుకుని భయపడుతూ అన్నాను. చెమట పోసింది.

"మోసమో, కబ్జానో చేసి సంపాదించడం నేడు మగతనానికి నిదర్శనం, ఆనవాయితీ అండి, తప్పులేదు. రాజ్యాంగంలో రాసేసారు. మీరు తప్పు అంటే ఎలా? లాభం లేదండి. గడపదాటటం తప్ప వేరే మార్గం కనిపించడంలేదు నా కోరికను కాంప్రమైజ్ చేసుకోలేను."

"తొందరపడకు!! ఎన్ని మధుర స్మృతలను పంచుకున్నాం; ఎన్ని ప్రణయ తీరాలు కలిసి ప్రయాణం చేసాం. తలుచుకుంటే గుండెలు పగిలే సమస్యలను ఎదుర్కున్నాం. కలిసి పోరాడాం. ఒక్కసారి ఆలోచించు. చేతిలో చెయ్యేసి ఎన్ని ప్రమాణాలు చేసావో గుర్తుకు తెచ్చుకో? భార్యా భర్తల అనందానికి ఆత్మీయమనుగడకు డబ్బే .. అత్యాశ కోరికలే ముఖ్యం, అవసరం, అంటే ఎలా? అవి మంటను రగిలిచ్చేవి, హృదయాలు కలిపేవి కాదు" చూసి చూడనట్లు, వినీ విననట్లు నిలిచి, నిప్పులు పోగించి వెళ్ళిపోయింది.

' మా అక్క ఏమయినా అమాయకురాలు మావా!!దేనికి తట్టుకోలేదు.ఆడోల్లు చాలా సున్నితులు !'

ఎవరు ? వెతికాను పక్కనే ఉన్నాడు. అనుమానం వచ్చింది నా పెండ్లా ..చ .అర్థాంగి గూడచారి . అయినా ఈ బామర్దుల్ని నమ్మ ...అమ్మో! ఈ ఆడంగులకు భాతృ ప్రేమ కడవలు..కడవలు, జాగర్త ! "మరి మాకుండదా చెల్లి తల్లి..?"

"వాళ్ళు పరాయి వాళ్ళు. మాట్లాడ... కూడదు.ఆ వాసన వేరు !! పాపం.వీళ్ళు మనల్ని దాటిపోలేరు మావా!!' నిదానించి చూసాను అక్క పోలికలు కనిపించాయి. ఈ బామ్మరుదులు అక్కలకంటే బావలకు ఆత్మీయంగా ఉంటారు. ఫెర్మోన్స్ !! చెమట వాసన ..ఛీ.. దైవ గ్రంధులు ! ఆమెలో లేనిది ఉండొచ్చు. సంధికి సందర్భానికి పనికి రావచ్చు.చాలా అమాయకుడుగా అనిపిస్తున్నాడు. ఉండనీ !!

"నీ ముఖం. నిన్ను చంపి నీ శవం మీద ఎక్కి గట్టుదాటుతుంది" అని ఉన్న మాట చెప్పాను.

"నేను నమ్మను. ఈ ఆడోల్లు లేకపోతే కూడుపెట్టి మేపేవాళ్ళు, గుడ్డను, గోచిని ఉతికే వాళ్ళు ఎక్కడ దొరుకుతారు మావా ? పాపం! వాళ్ళ మీద పడతావెందుకు? ఎంత మంది కర్కోటపు మగ ముండా కొడుకులు తాగుడు, జూదాలు,

ముండలతో సరదాలు వెలగబెట్టి ఇంటికొచ్చి, పెళ్ళాల్లను, పిల్లలను చితకబాది నరకంచూపించినా వదలక సేవలు చేసే మహాతల్లులు ఉన్నారు !! ఎప్పుడొస్తే అప్పుడు కూడు పెట్టాలా , పడకెయ్యాల,కంపుకొడుతున్నా పడుకోవాల !!'

"ఇప్పుడా ఈ కాలంలోనా? వేసుకున్న సెంటు బాగాలేదని ఏకంగా విడాకులిచ్చేస్తున్నారు. ఇక పడుకునేది ఎక్కడ?" ప్రశ్నార్ధకంగా చూసాను. గుర్రుగా ముఖం పెట్టాడు. బహుశా వాళ్ళ అక్కను అంటున్నాననేమో? ఇతని దగ్గర జాగర్తగా ఉండాలి పొగపెట్టొచ్చు , కారం చల్లొచ్చు!!

ఆడవాళ్లకు ఏది ముఖ్యమో వాళ్ళకే అర్ధం కాదు?.. అందరిలోనూ తప్పులు, పొరపాట్లు ఉంటాయి. చిన్నా పెద్దా ప్రతిదానికి సాధించడం, పొడిగించడం నేటి స్త్రీ శాడిజపు హక్కు. కూర్చుని, సామరస్యంగా సౌమ్యతతో మాట్లాడే స్త్రీలు లేరు. పరిష్కారం ఒక్కటే గెలవాలి లేదా తెగాలి.!! అతి చిన్న సర్దుబాటుతో నూరేళ్ళ అన్యోన్య దాపత్యం చెయ్యొచ్చు. స్వాభిమానం ప్రతిష్ఠ అనే అర్ధం తెలియని అహంకారంతో అనుబంధాన్ని తగలబెట్టి మానసిక సంఘర్షణలను తట్టుకోవడానికి చేయరాని పనులు చేస్తున్నారు.

"నువ్వొక సాడిస్టు మావా ! యద్భావం తద్భవతి అన్నారుకదా ! మన మనసులో కలిగేదేకదా కనిపించేది. మరి మన తల్లి చెల్లి...?"

" పిచ్చోడా అది పేగుతో ముడిపడింది. ఇది పసుపు పూసిన పుటుక్కున తెగిపోయే పురికొస!! .ముఖ్యంగా నీ డబ్బు, స్టేటస్,కన్నీళ్లు తో లింగు లింగు మంటూ ఊడిపోడానికి సిద్దంగా ఉంటుంది."

'నేను ఒప్పుకోను ! మనం లేకుంటే ఎలా బ్రతుకుతారు మావా?'

"అమాయకుడివి నువ్వు ! ఆ కాలంలో నాకు తెలియదు. ఇప్పుడు క్లబ్బులు, పొగ గొట్టాలు , తాకిడ్లు ,తోపులు ఎక్స్ పోజింగులు కోకొల్లలు!! సారీ ! ఈ తడుబ్బాతగాళ్ళు అంటే మగాళ్ళు... క్షమించు.. గొందుల్లో సందుల్లో వెయిటింగు.. కోకొల్లలు !! తాళికి, ఒకే వ్యక్తికి కట్టుబడి ఉండే ఆడోల్లు చాలా తక్కువ" 'మరి మన సంస్కృతి, సమాజం, భావి పౌరులు ఏమయి పోవాలి? మానం, మర్యాద గంగలో కలిపి గుడ్డ లిప్పేసి అరుపులు ఆగాలతో వీధిన పడితే ఎట్లా మావా? ఇంకేదయినా మార్గం... రిలీఫ్ కోసం... ?

" వోడ్కా, విస్కీ .ముఖ్యంగా నాజూకు నే,,నెరజాణలు సందివ్వకుండా గుటుక్కు గుట్టుక్కున తాగి కక్కడానికి ప్రతి గొట్టంగాడి వెనక పడకుండా రెడ్ లైట్ ఏరియాలో లైసెన్సులు ఏర్పాటు చేసుకోవడమే!"

" మొగుళ్ళు పనికిరారా ? మిండగాళ్ళేకావాలా!? తప్పుకదా మావా!'

"నీ ముఖం, రెండు నిముషాల కక్కుర్తికి ఎవడైతేనేమి ? త్రిల్ ..వెరైటీ నేటి యువత మతం."

' ఛీ ! పరువుపోతుంది మావా!'

మాట్లాడలేదు. గీరుకోవడమేగాని, నైతిక విలువల్ని, మానాభిమానాల్ని పాత సామానలోడికి అమ్మేసారు .ఓర్పు ఓదార్పులను అంటరానివిగా చేసేసారు. బాధ్యతను బజారుపాలు చేసారు.

“ఆడవాళ్ళ జీవితాలు ఘోరంకదా మావా?”

కానీ ఈ కాలం ఆడోళ్ళు ? వాళ్ళ మనసులు , శరీరాలు, తామరాకు మీద నీటి బొట్టులాంటివి .ఆలు చిప్పలోని ముత్యం లాంటివి. పాపాలు, దోషాలు అంటవు. అందకే రోజూనో లేక అప్పుడప్పుడు ...!?

“బూతులు మాట్లాడకు నాయనా!”నా చీకటిలో ఎవరో ఘోషించారు.

కోపం వచ్చింది. “ అవి బూతులా? ఎందుకు ప్రతి దాన్లో కల్పించుకుంటావు ? సృష్టిలో అత్యంత ఆకర్షణీయమైన సమ్మోహిత రూపం స్త్రీ. చెప్పుదెబ్బలు, చీత్కారాలు, ప్రేమ ప్రకోపాలు. కాళ్ళు పట్టుకోవడాలు అమ్మోడు పోయినా, అనుభవించినా,వాడుకున్నా అదొక తప్పుగా... ? ”

‘చెప్పు..చెప్పు’ మాటతో దిగంతాలు మారు మ్రోగాయి. పరుగు తీస్తున్న మావను పట్టుకున్నాను.

“మనం.. మనం ఏంగావాలి? పాతివ్రత్యం, ప్రతిష్ఠ, నైతిక గోచిపాత గంగపాలేనా?? ఆగు ఆగు !! శీలాన్ని జాతీయం చేసి, ఆ పదాన్ని నిఘంటువులోనుంచి శాశ్వతంగా మనిషి నిగూడ మేదస్సునుంచి తొలిగించేస్తాము. పరువు ప్రతిష్టలకు దానితో ఏ సంబధం లేదని నిరూపిస్తాము”

మావ అందుకున్నాడు.’అప్పుడు పక్కింటోడితో, ఎదురింటోడితో అఫైర్స్ అంటే అర్ధరాత్రి ఎక్స్ట్రా మారిటల్ తంతులు , లాలూచీపడి మొగుడ్ని గొంతులు కోయడాలు, తలను బండలతో మొదటాలు, రైళ్ళు, బస్సులు పట్టుకుని నగలు నాణ్యాలు బొడ్డులో దోపుకుని పారిపోవడాలు ఉండవుకదా?’

‘నీకు దినాలు దగ్గరపడ్డాయి” నాలో ఉన్న చీకటి అంతరాత్మ అనే బడుద్దాయి అన్నాడు.

ధైర్యంకూడగట్టుకుని,“దేనికి ?” పులిగా అరవబోతే పిల్లి అరుపు దూకింది.

‘నీ సంసార జీవితానికి !!’

“నేనేం చేసాను? ఎదురు చెప్పడం లేదుకదా ! కూర బాగా లేదు అన్నాను. దానికే... ?”

‘ఎంత తప్పో తెలుసా ! కూర బాగాలేకపోతే. ప్యాంటు జోబులోనో ,లుంగీలోనో మూటగట్టుకో తెలియకుండా కుక్కలకైనా , పందులకైనా వెయ్యి, కంపుగొడుతున్నా ఆహా..ఊహూ ..ఓహో! తినాలి’

“మరీ దారుణం. నిజం చెప్పకూడదా!?”

‘అదే ఆ లెక్కలేనితనమే విడాకులకు కారణం. మూడు సంవత్సరాల క్రితం నగ అడిగింది ‘

అప్పుడు మెరిసింది ఆవిడ విసుగెందుకో! ఇంతకాలం.. ఔరా!!! అవును. ఫ్లవరవాజులు, బొచ్చెలు ముక్కలు ముక్కలు , కూర మాడ్చడం , నా పంచెలు, చొక్కాలు మసిగుడ్డలు ,గ్యాసు తిప్పేసి ముఖం కాల్చకోబోవడం...?? ఇంటిలో సోఫాలు కుర్చీలు.. పాపం! కాళ్ళూ చేతులు లేకుండా వికలాంగులు అవడం, ముక్కు చీది ఇల్లంతా ముగ్గులు వెయ్యడం . వాటి రిపేరు ఖర్చుతో నాలుగు నగలు కొని ఉండవచ్చు.

ఒక్కసారిగా మావ ఎగిరి నా వెనక దాక్కున్నాడు. ఎదురుగా మా ఆవిడ శూలం నా గొంతుకు గురిబెట్టి నిప్పులుగక్కుతోంది. తమ్ముడు ఉన్నాడనేమో నన్ను కాల్చేటట్లు చూసి తిరిగి వెళ్లిపోయింది.

ఊపిరి గట్టిగా పీల్చుకుని అన్నాడు. 'ఎందుకు మావా అక్కను చూస్తే అంత భయపడి చస్తావు.'

"తాళి వేసుకునే ఉందికదా ఇంకా... ?"

' బలే వాడివి మావా! నువ్వు చస్తేకదా తెంపాలి' అని గాలి వదిలేసాడు.

"అవసరం లేదు.ఎప్పుడైనా తెంపుకోవచ్చు ! మూడు ముళ్ళు చాలా నాజూకుగా వేసాను పెండ్లప్పుడు. ఎక్కడ కమిలిపోతుందో, సున్నితంగా మెరుస్తున్న మెడకు నొప్పి తగులుతుందోనని, సెక్స్.. ఛీ ..ప్రేమ పొంగిపోయి, చక్కగున్నావే చిక్కనైనదానా అనేసా ..నోరుజారి. అంతే ...? తరువాత భాగం... ??

'తిరుగుబాటు చెయ్యలేమా ?'

"చెయ్యొచ్చు...!?" ప్రక్కనే ఎదో చీర గర గర లాడి నట్లు అనిపించి ఉల్లిక్కి పడ్డాను.

మావకు చెమటలు పోశాయి.

" ఏవిటి తిరుగుబాటు ..విప్లవం అంటున్నారు. వస్తుంది..తెస్తాం త్వరలోనే ! మిమ్మల్ని చెప్పు చేతుల్లో పడి ఉండేటట్లు, నోటికొచ్చినట్టు వాగితే... !!" అంటూ ఇప్పుడు మావను మింగేటట్లు చూసింది.

'అక్కా! అదిగాదు> మావ, మిమ్మల్ని మెచ్చుకుంటూ ఉంటే ...?' నాగిన్ డ్యాన్సు వేస్తూ అన్నాడు.

"నాకు తెలుసు . ఇద్దరు మగాళ్ళు కలిస్తే ఎవర్ని గురించి ఏం మాట్లాడుకుంటారో దేన్ని తడుముకుంటారో ?" అని వెళ్లిపోయింది.

పట్టిన చెమటను తుడుస్తూనే ఉన్నా, కడవలు కడవలుగా కురుస్తూనే ఉంది . నా వైపు తిరిగి.' మరీ బూతుకదా !' అన్నాడు మావ నాలిక తడుపుకుంటూ.

" అత్యంత ఆధునిక, లిబరల్ నాగరికత ప్రారబ్ధం. మరీ పబ్లిక్గా..నా కొడకా.. యువతుల హైపర్ ప్రేమ ? ఏంది భే ..పోరా.. రారా.. దొంగా నాకొడకా..అక్కడ దింపు . ఇక్కడ దోపు . .దొబ్బు.. గబ్బు ..సచ్చినోడా ఇంకా దరిద్రంగా వినకూడని మాటలు. మరీ అసబ్య .. ఇంటిమసి.. అంటే నికార్సయిన అన్యోన్యతకు మరీ...గుడ్డలులేని ప్రేమకు అతి దగ్గరకు నిదర్సనం ! యాక్కు.. తూ.. !! అదేదో వెబ్ సీరీసుల్లో ముక్కాలు గంటలో మూడుసార్లు అన్నీ తీసేసి కసరత్తులు చేస్తారట . అభ్యంతరం లేదు. అది కళాపోషణ. అబ్బో..ఒహో! ఈ పిల్లాజెల్లా , ముసలిముతక, కుర్రకారు ఆడ మగ ... భావిభారత పౌరులు, ప్రభుత్వ పాలనాధికారులు సగమే చూపించారని, మిగిలింది కూడా చూపిస్తే మీ అబ్బ అమ్మసొత్తు ఏం పోయిందని తడుబ్బాతలు విప్పి నోటీసులు , ట్విట్టేర్లు, ఇన్ స్టాగ్రాములు, బండ బూతులు !! చదువు లేదు సంధ్యలేదు కాండోమ్ పరిశ్రమ కొడంతై గోరంతై .. పురోగతికి స్మశాన తద్దినం. ఎవరికీ పట్టింది సంస్కృతి ,

సమాజం!! . పిచ్చి... మనం బాగుచెయ్యగలమా? కాలం మారిపోయింది !!అయినా దాన్ని తప్పు పట్టితే ఎట్లాగండి ? పరిశ్రమలు, ఉపాధి కల్పనలు ?? ప్రతి ఇంట్లోను అదే నైట్ షో వ్యాకరణ శబ్దాలంకారం"

"నిజమే మావా! ఆడోల్లే కదా తొలి అయ్యోరు,అమ్మోరు . మరి వీళ్ళే భాగోతాలాడితే ఎట్లా?'

నా ముందే ఒక తండ్రి మోటారుబైకు మీద బిడ్డని కూర్చోబెట్టుకుని , బిడ్డ చెప్పేమాటలకు నవ్వుకుంటూ, ఎక్కడలేని ఉషారుతో ఆనందంగా వెళుతున్నాడు. వాళ్ళ కెదురుగా నూతన దంపతులు ఉల్లాసంగా ఇంకో కొత్త మోటారు బైకు మీద వస్తున్నారు. ఇద్దరూ ఆత్మీయ పలకరింపులు, బెస్ట్ ఆఫ్ లక్కులు చెప్పుకున్నారు.

"చూడు మావా! అదీ బ్రతుకంటే, అలా ఉండాలి సంతోషం అంటే ! అక్కడున్నాడు మావా! దేవుడు!! వాళ్లకు తోడుగా...?" వెంటనే గావుకేకపెట్టాడు. ఏవిటని చూసాను? మావ తలగొట్టుకుంటూ రోడ్డుకు అడ్డంగా పరిగెత్తుతున్నాడు.

ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. పరుగెత్తాను.

మావ లబోదిబోమని గుండెలు బాదుకుంటూ, తండ్రి శవం ప్రక్కన దిక్కుతోచక బిత్తరచూపులు చూస్తూ దీనాతి దీనంగా ఏడుస్తున్న పాపను, స్మారకం లేకుండా పడి ఉన్నమొగుడ్ని శతవిధాల లేపాలని ప్రయత్నిస్తున్న నూతన వధువును చూపించి...చూపించి ఏడుస్తున్న మావను ఎలా ఓదార్చాలో తెలియక పిచ్చివాడినయి పోయాను.

" చూడు మావా! ఈ అన్యాయం! ఇదేనా రాత ? ఆ దరిద్రపు వక్రబుద్ధి శాడిస్టు . చేతగాని దద్దమ్మ ఇలాగేనా రాత రాసేది . ఇంకేం పనిలేదా! ప్రేమ జంటలను విడదీయడం , నవ వధూవరులను చంపడం. తల్లి తండ్రుల్ని చంపి ,పిల్లల్ని అనాధుల్ని చేయడం, ఇదేనా కాలం అనే దేవుడు చెయ్యాల్సింది?"

"గమ్మనుండు. ఓర్చుకో ! వాళ్ళు మళ్ళీ పుడతారులే ! ఆత్మకు చావులేదు.! భౌతిక శరీరం నశించినా ఆత్మనిత్యము."

' జాతస్య హి ధ్రువో మృత్యుహ్ ధ్రువం జన్మ మృతస్య చ ! తస్మాదపరిహార్యేన్ ర్థే న త్వం శోచితు మర్హపి !!' సాంఖ్యయోగం 27 శ్లోకం !! పుట్టిన వానికి మరణం తప్పదు. మరణించిన వానికి పునర్జన్మ తప్పదు.అనివార్యమగు ఈ పరిణామాలకు బాధపడకూడదు. సహజం అని తృప్తి పడాలి!!

"ఎట్లా మావా! ఎట్లా నమ్మ మంటావు."

"నమ్మక తప్పదు. అంతకంటే నువ్వు చేయగలిగింది ఏమీ లేదు. ఏడుస్తూ కూర్చుంటే జరగాల్సింది అంతా ఎవరు చేస్తారు.? ఆకలుంటుంది , బాధ్యత నెరవేర్చాలి ,ప్రాణం ఉంది కదా?నువ్వూ పోలేవుకదా?"

"అని నమ్మి బతుకును ఈడ్చుకు రమ్మంటావు."

"కాదు. మరిచిపోయి జీవితాన్ని సాగించమంటాను. లేరు..రారు అనుకున్నప్పుడు తప్పదు !! "

"ఎందుకని?"

“నిజం కాబట్టి. దాన్ని అర్ధం చేసుకుంటే ఈ విడాకులు పెటాకులు, జుట్లు జుట్లు పీక్కుంటూ పిడిగుద్దులు , డబ్బు సంపాదించడం కోసం దగుల్బాజీ పనులు చెయ్యరు. కొంత తృప్తిగా బ్రతకొచ్చు.”

“అంటే , ఈ ఎగుడుదిగుళ్ళను, గుండెపగుళ్ళు, సహజం, సాధారణం అని జీవితాన్ని భరించమంటావు. అట్లాగయితే మనకు స్పృహలు, భావోద్వేగాలు ఉండకుండా పుట్టించి ఉంటే, పోరాటం చెయ్యక రాయిలానో, రప్పలానో జన్మనిచ్చి ఉంటే సరి, ఆకర్షణలిచ్చే, ఆనందించమని మనసిచ్చే, మరి పుట్టుక ఎందుకంట? నడిమంత్రపు చావులు ఏవిటంట ? ”

అర్ధంగాని ప్రశ్న ...జవాబు చెప్పలేని సంఘర్షణ !!

“ఏవండి సినిమాకు వెళదామండి.”

ఉలిక్కి పడ్డాను. “ విడాకులన్నావు!”

“అవి రిజర్వులో ఉన్నాయండి. మళ్ళీ ఎలా ఉంటామో ఏమో?”

“మరి ఇప్పుడెందుకు... ఫ్రీగా తీసుకోనేందుకా?”

“డిటాచ్మెంట్ వస్తుందేమోనని. తెలుగు సినిమా చూస్తే విరక్తిపుట్టి ఏదయినా ఐడియా వస్తుందని.”

“ ఇప్పుడు కాపురం చేస్తున్నామా?”

“పడి ఉన్నాను కదా!”

నా నిజాయితీని, ఆమె మీద ఉన్నప్రేమను నమ్మటంలేదు, గ్రహించలేదు. మరి బంధం, శాశ్విత అనుబంధం ఎలా ఏర్పడుతుంది ? ఈ పెండ్లెందుకు? క్షణికమైన అపశృతులకు, ఆలోచన లేని అర్ధంగాని ప్రకోపాలకు, ప్రలోభాలకు, బానిసలయ్యే అర్భకులకు జన్మ నివ్వడానికా? తల్లిదండ్రుల అన్యోన్య అనుభందాల మీదనే బిడ్డల వ్యక్తిత్వం, ఎదుగుదల ఉంటుంది. మరచిపోతే విధ్వంశక సమాజమే !!

స్వచ్ఛమైన ప్రేమ, నమ్మకం,మరుపు, మన్నింపు ఆశించని అర్పణే, భార్యా భర్తల జన్మజన్మల బంధం!!

“బాగుందికదండి.”

“ ఏవిటి ?” సినిమా చూస్తున్న నేను తిరిగి చూసి భయపడుతూ అడిగాను .

“అదే, వాడ్ని వదిలేసి .. ఇది మూడోదనుకుంటా..వేరే వాడ్నికట్టుకోవడం. చాలా అనుభవం తెచ్చుకోనుంటుంది కదండీ. రౌడి, తాగుబోతు, ముండల ముటాకోరు అయితే ఏవండి. అన్నీ తెచ్చి ఇస్తాడు. డిటాచ్డ్ గా ఉంటాడు. ఎప్పుడో అవసరానికి వొళ్ళు ..? తరువాత వాడి దారి వాడిది. ఆవిడ దారి ఆవిడది. చాలా త్రిల్లింగుగా.. ఎక్జైటింగ్ గా జీవితం ఉంటుంది కదండీ !? ”

మా ఆవిడేనా? దారుణం!! ముఖం పచ్చడిచేయాలనిపించింది. ఏమో ఈ ఆడవాళ్ళు ఆలోచనలు, ప్రవర్తనలు అంతుబట్టవు. వింతలు విడ్డూరాలలో వినోధం స్త్రీ మనస్తత్వమేమో ? పదిమందికి కడుపు చేసి, పది బీరు సీసాలు తాగి, పదిమందిని కొడితే వాడు హీరో! ఆ పుంగవుడి మీద ఈ ఆడంగులకు క్రష్..క్రష్!!

కర్మ!! అసహ్యం వేసింది. " రోజు తాగి వచ్చి చావగొట్టి చెవులు మూస్తాడు. జుట్టుపట్టి ,గుడ్డ లిప్పి వీధిలోకి తన్ని తరుముతాడు."

" అదొక యాక్షన్, అడ్వెంచర్ కదండీ. ఎక్స్ పీరియన్స్. త్రిల్ అక్కడే ఉందండి . మేమూ తిరిగి మక్కెలిరగకొట్టి పోలీసోడికి, వీదుల్లో తిరిగే తెల్లచొక్కా నల్ల పందులు, కాబోయే ఎంపి, ఎమెల్యేలకు కన్నుగొడితే చాలుకదండి.ఇంకా వరైటీ... కదండీ. కొట్టుకొచ్చి ఇస్తుంటే తిని ఎంతో హాయిగా అలుపు ....!"

ఇంత మరీ బరితెగించి..?? జుట్టు పీక్కున్నాను. నెత్తి బాదుకున్నాను.. చుట్టుపక్కల చూసాను. ఆదుకునేందుకు కనీసం కలిసి ఏడ్చేందుకు ఒక్క మగ పురుగు లేదు. పళ్ళు రాలగొడదామా లేక ఆవిడ గొంతు పిసుకుదామా ? రెండూ చెయ్యలేనని తెలుసు. . అలుపు తీర్చుకోవడానికి మార్గం ఇది కాదు. కలిసిన మనసులతో ఒకరి కౌగిలో ఒకరు ఒదిగి ఈ లోకాన్ని మరిచి పోవడం !!

ఎక్కడివో మాటలు.!? దూరంగా కూర్చున్నా బాగా వినిపిస్తున్నాయి. కనిపిస్తున్నారు. సీతాలు రాములు.!!

"మావా...మావా ! పంచ భూతాలంటే ఏంది మావా? ఎక్కడుంటాయి?"

"ఇక్కడే నీ చుట్టూ పైనా కిందా !!"

భయంగా కిందకి పక్కకు చూస్తూ,"నిజంగానా?" అంటూ రాముల్నిగట్టిగా పట్టుకుంది సీతాలు.

వణుకుతుండడం గమనించి అమాయకత్వానికి నవ్వుకుంటూ దగ్గరకు తీసుకొని," ఓసి పిచ్చిదానా ! అవన్నీ నువ్వే!!"అంటూ ప్రేమగా కళ్ళల్లోకి చూసాడు.

"నేనా ?"

మరీ భయపడటం చూసి," ఓసి! నా తిమింగలామా ! ప్రతి ఆడకూతురూ ఈ భూతాల రాణులు."అన్నాడు.

" ఎకసక్కాలు ఆడమాక !! ఏంది మావా అవి ."

" నీరు, గాలి, నిప్పు, భూమి, ఆకాశం !!"

"మరి ఆడోళ్ళు ఎట్టాగవుతారు?

"చల్లదనం, వెచ్చదనం, జాణతనం, ఓ దార్పు, సహనం కలిస్తే ఆడకూతురవుతాది. మరి నువ్వేకదా !!"

సంతోషంతో పొంగిపోయింది.గబుక్కున ముద్దు పెట్టేసుకుంది రాముల్ని. సిగ్గుతో ముడుచుకు పోయింది. మరులతో దగ్గరయ్యింది. పరువం సెగలు చిమ్మింది.

ఉలుకు పలుకు లేకుండా ఎక్కడో అలోచిస్తున్నరాముల్ని చూసి," ఏమైంది మావా ?" చిరు కోపంతో ముదిగారంగా కదుపుతూ అంది సీతాలు.

" ఏం లేదు లేవే ?" అని మళ్ళీ అట్లాగే  ఉండిపోయాడు.

సీతాలు మనసు చిన్నబోయింది. శబ్దం రాక పోతే రాములు తిరిగి చూసి దగ్గరకు తీసుకుని " ఏదో దిగులుగా ఉంది." అన్నాడు.

" దిగులా!" సీతాలు గుండె నిలిచి పోయినట్లు అనిపించింది." ఏమైంది మావా! చెప్పవా ?"  రాముల్ని పొదివి పట్టుకుని విపరీతమైన ఆత్రుతతో కుదిపింది.

" పండక్కి నీకేం కొనలేక పోతున్నానని?"

పక్కున నవ్వింది సీతాలు.ఆశ్చర్యంగా చూసాడు రాములు.

" ఓ పిచ్చి మావా ! చీర కొనిస్తే సంతోషం వస్తాదా? బంగారం కొనిస్తే పేమ తెలుస్తాదా?" రాముల్ని కుదుపుతూ ,"మావా...మావా! నాకో వరం ఇస్తావా?'అడిగింది వెనకాడుతూ ముదిగారంగా  సీతాలు.

రాములు గుండెల్లో భయం చొరబడింది. అనుమానంగా చూసాడు సీతాలు వైపు.

" చెప్పు మావా!! మాట ఈవా ?" ఆమె చారడేసి కళ్ళతో  దీనంగా వేడుకుంది.

కాదన లేదు. ప్రాణం అయినా ఇచ్చెయ్యాలి అనిపించింది.

దగ్గరగా తీసుకుని ," అడుగు" అంటూ నొసటిపై  గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

మరులతో వణికి పోయింది." నీ గుండెల మీద నా పాణం పోవాల. అప్పటి వరకు ఇట్టాగే ఉండాలా!! ఇదే మావా నేనుకోరుకునే వరం. ఆడదానికి ఇంతకంటే ఏవిటి మావా... పండుగ సంబరాలు !!" ఒదిగి పోయింది సీతాలు రాముల ఒడిలో!

తరువాత వాళ్ళ కనిపించలేదు, మాటలూ  వినిపించలేదు

కానీ ఎక్కడ నుంచో  నా భార్య మాటలు వినిపించాయి.

"అవన్నీ ప్రాక్టికల్ కాదండి. గతిలేని సర్దుబాటు. మతిలేని వ్యామోహపు ప్రేలాపనలు"

ఇది ఈర్ష్య. అజ్ఞానం.ఆధునిక  ఆర్థిక  అహంకారం !! కుసంస్కారపు స్వతంత్ర భావాల కాలకూట విషం.  రూపం, చూపు, మాట   వాళ్ళ ఆయుధాలు .సృష్టినే శాసించగల శక్తి వాళ్ళ సొంతం.మరి ??

తల దించుకున్నాను.

యథా దృష్టి తదా సృష్టి.

. సమస్య అయినా పరిష్కారమైనా నీ ఆలోచనా విధానంలో అర్ధ చేసుకునే పరిజ్ఞానంలో ఉంది.

భార్యా మూలం ఇదం గృహం!

ఇంటి ఇల్లాలు వ్యక్తిత్వం మీదనే నీ ఇంటి సుఖము సంతోషం ఆధారపడి ఉంటుంది.

బంధం, అన్యోన్యఅనురాగాలతో నాటకం.. జూదం... ఆడ...?!!

అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం ఆత్మ తృప్తికై మనుషులు ఆడుకునే నాటకం కాకూడదు!!అదే జగన్నాటకం అనుకుంటే బంధం అనుబంధాలకు వ్యభిచారం అనే పేరు సరిపోతుంది.

స్త్రీ పురుషుల వివాహకలయికి మరోసృష్టికి పవిత్రమైన యుగసంధి. దాపత్యం జీవిత ధర్మపీఠం !!

ఎవరిదో నీడ కనిపించింది. తలెత్తి చూసాను. మా ఆవిడ. తదేకంగా నన్నే చూస్తోంది. ఆ చూపుల్లో తీక్షణత కనిపించలేదు. చేయి అందించింది. మరో మాట మాట్లాడకుండా నవ్వుతూ చేయి అందు కున్నాను

★★★★★★

COMMENTS